## 65 నుంచి 80 బస్తాలకు పెంచేందుకు నివేదిక

### ప్రజాశక్తి కథనానికి స్పందన

ఏలూరు:రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో 65 బస్తాల నిబంధన నుంచి 80 బస్తాల వరకూ పెంచాలని ఉన్నతాధికారులకు నివేదించామని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కె.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ప్రజాశక్తి దినపత్రికలో 'ఇ-క్రాప్‌లో నమోదైనా కొనరేం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక రైతు నుంచి ఆన్‌లైన్‌లో 12.50 ఎకరాలకు ధాన్యం ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని నిబంధనలు సూచిస్తున్నాయని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఎకరాకు 40 కిలోల బస్తాలు 65 వరకే ఆన్‌లైన్ నిబంధన ఉందని చెప్పారు. దాన్ని 80 బస్తాలకు పెంచాలని సూచించామని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్లు అందుబాటులో ఉంచామని వాటిని సంప్రదించాలని ఆయన కోరారు.

# గొంతు తడిసేనా..!

**వాటర్‌గ్రిడ్ పథకంపై జనాల్లో తీవ్రమైన చర్చ**

**మూడేళ్ల క్రితం గోదావరి నుంచి తాగునీటి పైప్‌లైన్ ప్రణాళికలు**

**ఎట్టకేలకు ఈనెల 21న శంకుస్థాపన చేసిన సిఎం**

**రూ.3,200 కోట్ల అంచనాల నుంచి రూ.1400 కోట్లకు కుదింపు**

**ఇంకా పూర్తికాని సర్వే పనులు**

**ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేనట్టే**

**డెల్టాలో కలుషిత నీటితో జనం అవస్థలు**



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'పసర్లు కమ్మిన నీటిని వాటర్ బాటిల్స్‌లో చూపిస్తూ ఈ నీటిని మనుషులు తాగుతారా'.. అంటూ 2019 ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా జిల్లాలో పర్యటించిన జగన్ అప్పటి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా గోదావరి నుంచి పైప్‌లైన్ వేసి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని ఉమ్మడి జిల్లాలోని ప్రజానీకానికి ప్రతిపక్ష నాయకుడి హోదాలో జగన్ హామీఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటర్ గ్రిడ్ పథకంపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు హడావుడి సైతం చేశారు. రూ.3,200 కోట్ల అంచనాతో ప్రణాళికలు సైతం రూపొందించారు. గోదావరిపై ఐదు చోట్ల పాయింట్లు రూపొందించి వాటికి అనుసంధానంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేసేవిధంగా ప్రణాళికలు తయారు చేశారు. తర్వాత వాటర్‌గ్రిడ్ పథకం గురించి పట్టించుకునే వారే లేకపోయారు. వైసిపి అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లు గడిచింది. ఎట్టకేలకు ఈనెల 21న నరసాపురంలో జరిగిన సిఎం పర్యటనలో వాటర్ గ్రిడ్ పథకానికి శంకుస్థాపన చేసిన పరిస్థితి నెలకొంది. శంకుస్థాపన జరిగినప్పటికీ వాటర్‌గ్రిడ్ ఇప్పట్లో పూర్తయ్యి జనాలకు తాగునీరు అందే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. గతంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాటర్ గ్రిడ్ పథకం వర్తింపచేస్తూ రూపొందించిన ప్రణాళికలను పూర్తిగా మార్చేశారు. ఇప్పుడు డెల్టాలోని మండలాల్లో మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేసేవిధంగా మార్పుచేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 18 మండలాలు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాలో ఎనిమిది మండలాలు మొత్తం 26 మండలాలకు పరిమితం చేశారు. బడ్జెట్ సైతం రూ.1400 కోట్లకు కుదించారు. ఆక్వా సాగు కారణంగా డెల్టాలో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. దీంతో ముందుగా డెల్టాకైనా నీరందిస్తే చాలని అంతా భావించారు. ఇప్పట్లో మాత్రం జనాలకు వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీరు అందే పరిస్థితులు మాత్రం కనిపించడం లేదు.

**ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేనట్టే**

మూడున్నరేళ్లుగా వాటర్‌గ్రిడ్ పథకాన్ని పట్టించుకోని వైసిపి సర్కార్ మూడున్నరేళ్ల తర్వాత శంకుస్థాపనకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రభుత్వ పాలన మరో ఏడాదిన్నర ఉంది. ఇప్పటి వరకూ వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించిన సర్వే పనులు పూర్తికాని పరిస్థితి. దీన్నిబట్టి చూస్తే ఇప్పట్లో వాటర్ గ్రిడ్ పథకం పనులు పూర్తయ్యే పరిస్థితిలేదని స్పష్టమవుతోంది. సర్వే పనులు పూర్తవడమే గగనమన్న చర్చ సాగుతోంది. ఇప్పట్లో డెల్టా ప్రజానీకానికి గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందే పరిస్థితి లేదని స్పష్టమవుతోంది. ఆక్వాసాగుతో తాగునీరు పూర్తిగా కలుషితమవడంతో డెల్టా ప్రజానీకం ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2014 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే 20 లీటర్ల తాగునీరు ఉచితంగా అందిస్తామంటూ హామీ ఇచ్చింది. అధికారం చేపట్టిన తర్వాత ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. పలుచోట్ల వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు లెక్కలు చెప్పినా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడలేదు. 2019 ఎన్నికల్లో తాగునీటిపై వైసిపి ఇచ్చిన వాటర్‌గ్రిడ్ హామీ సైతం నేటికీ నెరవేరలేదు. దాదాపు దశాబ్దకాలంగా డెల్టా ప్రజానీకం కొనుగోలు చేసిన తాగునీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప స్వచ్ఛమైన తాగునీరు మాత్రం అందించని పరిస్థితి నెలకొంది. కలుషిత నీటితో జనం రోగాలు భారీన పడుతున్నారు. తాగునీటి సమస్య ఎప్పటికి తీరుతుందోనంటూ జనం ఎదురుచూస్తున్నారు.

## వికటించిన మధ్యాహ్న భోజనం

### ఉమ్మడి జిల్లాలో 36 మంది విద్యార్థులకు అస్వస్థత - నిలకడగా ఆరోగ్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - పెదవేగి/ఏలూరు అర్బన్

పెదవేగి మండలం కూచింపూడి జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనం తిన్న 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఎప్పటిమాదిరిగానే శనివారం కూడా మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా కూచింపూడిలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఏడోతరగతి విద్యార్థులు భోజనాలు చేశారు. వారు భోజనాలు చేసిన కొద్దిసేపటికే ఇద్దరు విద్యార్థులు వాంతులు చేసుకోగా, మరో 13 మంది కడుపునొప్పితో బాధపడ్డారు. విషయం తెలుసుకున్న ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు హుటాహుటిన విద్యార్థులను పెదవేగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వారికి వైద్యసేవలందించారు. వెంటనే జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఆహారానికి సంబంధించిన తహశీల్దార్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించాలని తహశీల్దార్ నాగరాజును ఆదేశించారు. విద్యార్థులు తిన్న ఆహారాన్ని విశాఖపట్నంలోని ల్యాబ్‌కు పంపించినట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. అక్కడ నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలుంటాయని తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవిని, డాక్టర్ మాధవిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ప్రధానోపాధ్యాయుడు సురేష్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. చికిత్స అనంతరం విద్యార్థినులకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను మూడు రోజులు పాటు అందించాలని డాక్టర్‌ను ఆదేశించారు. ఆహారం తినడం వల్ల ఇలా అయిందా? లేక వేరే ఏమైనా కారణాలున్నాయా? అనేదానిపై విచారిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 230 మంది విద్యార్థులుండగా 15 మందికి ఇలా కావడంపై కూడా ఆరా తీస్తున్నారు.

**పరామర్శించిన ఎమ్మెల్యే అబ్బాయిచౌదరి**

విషయం తెలుసుకున్న దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి చేరుకున్నారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు.

**పాలకోడేరు** : వారంతా ఎప్పటిలాగానే ఉదయం పాఠశాలకు వెళ్లారు. రోజు మాదిరిగానే పాఠశాలలో వండిన భోజనాన్ని తిన్నారు. అయితే కొద్దిసేపటి తర్వాత ఉన్నట్టుండి పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే విద్యార్థులను అంబులెన్స్‌లో ఉపాధ్యాయులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ఒక్కసారి గ్రామంలో ఆందోళన నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురై కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన మండల కేంద్రమైన పాలకోడేరులో శనివారం చోటుచేసుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. పాలకోడేరు-1 ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 180 మంది విద్యార్థులు చదువుతున్నారు. జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం శనివారం గ్రీన్ రైస్ (పుదీనా, కొత్తిమీర అన్నం) పెట్టారు. 116 మంది విద్యార్థులు ఈ ఆహారం తిన్నారు. వీరిలో 21 మందికి ఆహారం వికటించి అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరు విద్యార్థులు వాంతులు చేసుకోవడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. వెంటనే విద్యార్థులను స్థానిక పిహెచ్‌సికి తరలించారు. ఆరుగురు విద్యార్థులకు కడుపునొప్పి రావడంతో వారికి మెరుగైన సేవలందించారు.

పుదీనా, కొత్తిమీర ఎక్కువ పరిమాణంలో వేయడం వల్ల విద్యార్థులకు వికారం ఏర్పడి అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే విద్యార్థులకు చికిత్స అందించి ఇళ్లకు పంపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ పాలకోడేరులో శనివారం రాత్రి పర్యటించారు. స్థానికంగా ఉన్న పాఠశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు నుంచి వివరాలు సేకరించారు. భోజన శాంపిల్స్ ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి ఇబ్బంది లేదన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను దగ్గరుండి పరీక్షించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. అవసరమైతే మరిగైన వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

**పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు : తల్లిదండ్రులు**

స్థానిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యంగా ఉండట్లేదని ఉపాధ్యాయులకు, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలకు ఏమైనా అయితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. భోజనం నాణ్యంగా ఉండటం లేదని చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇంటి నుంచి భోజనాన్ని తీసుకెళ్తున్నారని, కొన్ని పరిస్థితుల్లో పాఠశాలలో తింటున్నారని చెప్పారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు వైద్యులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు.

## దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా మార్చాలి

### సిఐడి చీఫ్ అడిషనల్ డిజిపి పివి.సునీల్ కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా మార్చినప్పుడే దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అంబేద్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు అడిషనల్ డిజిపి పివి.సునీల్ కుమార్ ఐపిఎస్ అన్నారు. శనివారం స్థానిక పైడిపాక నిర్వాసిత కాలనీలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక పంచాయతీలుగా దళితవాడలను మార్చినప్పుడే నిధులు సద్వినియోగమై దళితులు ఆర్థికాభివృద్ధి చెందారన్నారు. అలాగే దళిత పంచాయతీలకు దళితులే నాయకులు, సర్పంచులు వార్డు సభ్యులుగా ఎంపికై పరిపాలన నైపుణ్యం పెంపొందించుకుంటారని తెలిపారు. గతంలో లంబాడీ తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రత్యేక పంచాయతీలుగా దళితవాడలను మార్చడమే లక్ష్యంగా అంబేద్కర్ ఇండియా మిషన్ స్థాపించినట్లు తెలిపారు. అంబేద్కర్ ఆలోచన, ఆశయ సాధనకు అంబేద్కర్ ఇండియా మిషన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. స్వార్థ రాజకీయాలు, స్వార్థ ప్రయోజనాలకు వ్యతిరేకంగా జాతిప్రయోజనాల కొసం అంబేద్కర్ ఇండియా మిషన్ పనిచేస్తుందని తెలి పారు. దళితులకు కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించబడతాయన్నారు. దళితవాడ పంచాయతీగా మార్పు చేస్తే ఏడాదికి రెండు కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.10 కోట్లతో అభివృద్ధి జరుగుతుందన్నారు. దేశంలో ప్రతీ పేదకుటుంబం ఏడాదికి రూ.ఆరు వేలు, మధ్య తరగతి కుటుంబం రూ.12 వేలు, ధనిక కుటుంబం రూ.24 వేల పైబడి ప్రభుత్వానికి జిఎస్‌టి చెల్లిస్తున్నట్లు ఇటీవల నివేదిక వెల్లడైందని సునీల్‌కుమార్ తెలిపారు. అనంతరం సునీల్‌కుమార్‌ను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ పంతగాని వెంకన్న అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియా మిషన్ కార్యవర్గ సభ్యులు బోడా ఆనంద్, బి.ఆనంద్, స్థానిక ప్రముఖులు డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, సిఐ బాలసురేష్ బాబు, ఎస్ ఐ సాగర్ బాబు పాల్గొన్నారు.

## దళిత సమస్యలపై పోరాటం : కెవిపిఎస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిరంతరం దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై కెవిపిఎస్ నిరంతర పోరాటం చేస్తుందని కెవిపిఎస్ నూతన కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. కెవిపిఎస్ ఏలూరు జిల్లా మహాసభను స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్ ఆవర ణలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా మంగం సురేష్, అందుగుల ఫ్రాన్సిస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ సక్రమంగా అమ లు చేయాలని ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశా రు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎస్‌సి సంక్షేమ హాస్టల్‌కి సౌకర్యాలు కల్పించాలన్నారు. దళితుల భూమిని ఇళ్ల స్థలాల పేరుతో ప్రభుత్వం లాక్కోవడం ఆపాలని, ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న దళితుల భూములకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజశేఖర్ ఎన్.అప్పారావు, మరియమ్మ, జానేష్, ఆడమిల్లి సోమరాజు, నాని, రమేష్, మహేశ్వరి పాల్గొన్నారు.

## సహకార రంగాన్ని విచ్ఛినం చేస్తున్న ప్రభుత్వాలు

### ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

మాట్లాడుతున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగాన్ని విచ్ఛిన్నం చేస్తూ రైతులకు సహకార సంఘాలను దూరం చేస్తున్నాయని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ విమర్శించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ మహాసభ శనివారం తాడేపల్లిగూడెం గుణ్ణం ఫంక్షన్ హాలులో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి, యూనియన్ గౌరవ అధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలో జిల్లాల విభజన వల్ల మూడు జిల్లాలు మూడు కమిటీలను ప్రకటించారు. ఈ మూడు కమిటీలకు ఆయా జిల్లాల సిఐటియు నాయకులు గౌరవ అధ్యక్షులుగా ఉండనున్నారు. ప్రతీ బ్రాంచ్ నుండి ఒక డైరెక్టర్‌ను ఎన్నుకోనున్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాబ్జీ మాట్లాడుతూ సహకార చట్టానికి తీసుకువచ్చిన సవరణలు శాసనమండలిలో కనీసం చర్చకు కూడా పెట్టకుండా ఆమోదించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహకార రంగాన్ని కాపాడుకునేందుకు ఉద్యోగులు, రైతులు ఐక్యంగా పోరాడాలన్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ, సహకార చట్టాల్లో రైతులకు ప్రాధాన్యతను తగ్గిస్తూ 50 శాతం ప్రయివేటు వారికి అవకాశం కల్పించడం సహకార రంగాన్ని నాశనం చేయడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షులు పివి.సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న హెచ్‌ఆర్‌సి పాలసీని మొత్తం ఉద్యోగులందరికీ అమలయ్యేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని, అందుకు ఉద్యోగులందరూ ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. కోశాధికారి టి.వెంకటరామయ్య మాట్లాడుతూ హెచ్‌ఆర్ పాలసీలో ఉన్న అంశం గురించి అలాగే పదవీ విరమణ వయసును సంఘ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని కోరారు. ఈ మహాసభలో సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సొసైటీ ఉద్యోగుల సంఘం సీనియర్ నాయకులు టి.గంగరాజు, తూర్పుగోదావరి జిల్లా నాయకులు ఆదినారాయణ, జిల్లా కన్వీనర్ పివి.నరసింహారావు, నాయకులు మాట్లాడారు.

## వ్యకాస మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆ మేరకు మండలంలోని ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద శనివారం పర్యటించి మహాసభ గోడ పత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఉపాధి పనులను 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతానికి పనులను విస్తరించాలని రూ.600 కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఈనెల ఎనిమిదో తేదీన నిర్వహించే బహిరంగ సభలో ఉపాధి కూలీలు, మేట్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు ఉపాధి హామీ రూపకల్పన చేసిన బృందాకరత్ హాజరవుతున్నారన్నారు. అఖిలభారత అధ్యక్ష కార్యదర్శులు విజయ రాఘవన్, వెంకట్ పాల్గొంటారని చెప్పారు. జంగారెడ్డిగూడెంలో ఎనిమిదో తేదీన జరిగే బహిరంగ సభతో పాటు 9, 10న జరిగే మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడకం సుధారాణి, సంఘం అధ్యక్షులు కుంజ బాబూరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## పెరటి తోటల పెంపకం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రతిఒక్కరూ తమ ఇంటి నివాస ప్రాంతాల్లో పెరటి తోటల అభివృద్ధి, వాటి పెంపకాన్ని అలవర్చుకోవాలని నగర కమిషనర్ షేక్ షాహిద్ తెలిపారు. స్థానిక సిఆర్‌ఆర్ పబ్లిక్ పాఠశాల ఆవరణలో శనివారం పెరటి తోటల అభివృద్ధి, సురక్షిత కుటుంబ ఆరోగ్యంపై నగరపాలక సంస్థ, గ్రామదీప్ స్వచ్ఛంద సంస్థ, సిఆర్‌ఆర్ పాఠశాలల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ షాహిద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, క్లీన్ ఏలూరు దిశగా ప్లాస్టిక్ నిషేధంపై పలు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిషేధిత ప్లాస్టిక్, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పలు పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగానే రసాయన ఎరువుల వాడకం తగ్గించి ఆర్గానిక్ పద్ధతిలో పెరటి తోటల అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు రకాల కూరగాయ నారులను ఒక రూపాయికే నిర్వాహకులు అందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి కమిషనర్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామదీప్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ మనోహరి, కళాశాల ప్రిన్సిపల్ పి.సాయికుమారి శంకర్, కళాశాల డైరెక్టర్ కె.రాజకళ, కరస్పాండెంట్ వి.రవికుమార్, పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లాలో సిఐఆర్‌ఎడి సంస్థ ఫ్రాన్స్ బృందం పర్యటన

### ఆయిల్ పామ్, సేంద్రియ వ్యవసాయ విధానం పరిశీలన

పంటను పరిశీలిస్తున్న ఫ్రాన్స్ బృందం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఆయిల్ పామ్, సేంద్రియ వ్యవసాయ సాగు క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం ఫ్రాన్స్‌కు చెందిన సిఐఆర్‌ఎడి సంస్థకు చెందిన సీనియర్ ఆర్థిక వేత్త బ్రూనో డోరిన్, పరిశోధకులు డాక్టర్ సెల్వియన్ రాఫేల్గేయ బృందం శనివారం పెదవేగి మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా బాపిరాజుగూడెంలో సేంద్రియ వ్యవసాయ విధానం, సేంద్రియ విధానంతో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న ఎం.సత్యనారాయణ, ఎరువులతో ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్న వి.పెంటయ్య పంట క్షేత్రాలను వారు పరిశీలించారు. అనంతరం జి.ఝాన్సీరాణి సేంద్రియ విధానంతో కోకో, కొబ్బరి సాగుచేస్తున్న క్షేత్రాన్ని వారు పరిశీలించారు. అనంతరం గ్రామ స్వయం సహాయక గ్రూపు సభ్యులు సాగు చేస్తున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి వారితో ముఖాముఖిగా మాట్లాడారు. అనంతరం లక్ష్మీపురం చేరుకున్న బృందం సేంద్రియ పద్ధతిలో ఆయిల్ పామ్‌లో అరటి అంతర్ పంటగా సాగుచేస్తున్న చక్రపాణి రైతు పంటపొలాన్ని వారు పరిశీలించారు. ఆయిల్ పామ్, సేంద్రియ వ్యవసాయ సాగు విధానాలపై అధ్యాయనంలో భాగంగా క్షేత్రస్థాయిలో రైతులు వారు సాగు చేస్తున్న పద్ధతులు, సమస్యలపై అవగాహన కల్పించేందుకదు ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతులతో ముఖాముఖి కార్యక్రమం రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ టి.విజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో పెదవేగి మండలం బాపిరాజుగూడెం గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా ముక్కామల సత్యనారాయణ ఆయిల్ పామ్ సాగుపై ఉన్న అనుమానాలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చారు. సీనియర్ శాస్త్రవేత్త బ్రూనో డోరిన్, పరిశోధకులు డాక్టర్ సెల్వియన్ రాఫేల్గేయ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో ప్రత్యామ్నాయంగా నిమ్మ, నారింజ, పంటలు పండించుకోవచ్చని, కొబ్బరి పంటను ఏమాత్రం వేసుకోకూడదని తెలిపారు. కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని చేయాలని, ఆయిల్ పామ్ రైతులందరూ కలిసి ఆయిల్ ప్రోసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకొని ముందుకు వస్తే ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో పామ్ ఆయిల్, కోకో సాగును పరిశీలించారు. అనంతరం హరిజనవాడలోని మహిళా శక్తి సంఘాలు ప్రకృతి ఎరువులతో పండిస్తున్న ఆకుకూరలను, కాయకూరలను పరిశీలించారు. అనంతరం క్రాంతిజ్యోతి సంఘ సభ్యులతో బృందం సమావేశమై ప్రతినెలా వారు చేస్తున్న పొదుపు, బ్యాంకుద్వారా తీసుకున్న రుణాల ద్వారా చేస్తున్న వ్యాపారం, వ్యవసాయంపై సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో ప్రకృతి వ్యవసాయం చేసేవారికి సర్టిఫికేషన్ అందిస్తామని ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ టి.విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి జోగి పెదపెంటయ్య, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వై.నూకరాజు, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.పాండురంగ, ఉద్యానశాఖ అధికారి రత్నమాల, తహశీల్దార్ ఎన్.నాగరాజు, వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్దండ యోధుడు ఉద్దరాజు రామం

### నేడు 28వ వర్ధంతి



ప్రజాశక్తి - పశ్చిమడెస్క్

జీవితాంతం ప్రజల పక్షాన నిలిచి పోరాడిన యోధుడు ఉద్దరాజు రామం. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సులోనే జాతీయోద్యమంలోకి దూకారు. కాంగ్రెస్ నాయకుడిగా పోరాడిన రామం అనంతర కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర నేతగా పీడిత ప్రజల విముక్తి కోసం, సమ సమాజ నిర్మాణం కోసం జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారు. ఆయన స్వగ్రామం పాలకొల్లు సమీపంలోని వాలమర్రు.

రామం అతి చిన్న వయస్సులోనే 1930లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని తొమ్మిది నెలల కారాగార శిక్ష అనుభవించారు. ఇనుమడించిన ఉత్సాహంతో 1931లో విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమంలోనూ, రీసెటిల్‌మెంట్ సమయంలో దండు నారాయణరాజుతో కలిసి పాల్గొన్నారు ఘోషా పద్ధతికి స్వస్తి చెప్పి తన సతీమణి మాణిక్యాంబను రాజకీయోద్యమాల్లోకి తీసుకొచ్చారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో ఆమె సైతం పది నెలలు కారాగార శిక్ష అనుభవించారు. 1932లో జరిగిన శాసనోల్లంఘనోద్యమంలో రామం రహస్య జీవితాన్ని గడుపుతూ వీరభారతి పత్రిక నిర్వహణకు తోడ్పడ్డారు.

1930లోనే రామంకు కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ఒకరైన సుందరయ్యతో పరిచయం ఏర్పడింది. కమ్యూనిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించారు. 1934లో రామం కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. కాంగ్రెస్ కార్యకలాపాలు సాగిస్తూనే యువకులను సంఘటితపర్చడంలో ప్రముఖ కషి సాగించారు.

1935లో పశ్చిమగోదావరి జిల్లా యువజన సంఘానికి అధ్యక్షులుగా ఎన్నికై, యువకుల్లో రాజకీయ చైతన్యాన్ని, నూతనోత్సాహాన్ని నింపారు. 1938-39లో కాళీపట్నం రైతులు తమ హక్కుల కోసం పోరాటం సాగించారు. ఆ పోరాటానికి రామం నాయకత్వం వహించారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైనప్పటి నుంచి కూలి సంరక్షణ సంఘాలను నెలకొల్పడానికి కృషి చేశారు. రైతుకూలి ఉద్యమాలను నిర్మించి జిల్లా, రాష్ట్ర రైతు సంఘాల్లో బాధ్యతాయుత స్థానాలను నిర్వహించారు. రెండో ప్రపంచయుద్ధం ప్రారంభం కావడంతో కమ్యూనిస్టులను బ్రిటీష్ ప్రభుత్వం వేటాడటం ప్రారంభించింది. దీంతో ఆయన 1940 నుంచి మూడేళ్లపాటు పోలీసులకు చిక్కకుండా కమ్యూనిస్టు కార్యకలాపాలు నిర్వహించారు. 1942లో వారంటు రద్దవ్వగానే రామం బయటకొచ్చారు. అయితే బ్రిటీష్ ప్రభుత్వం కక్షబూని 1943 జనవరి నుంచి 1944 జనవరి వరకూ నిర్బంధించింది. జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ అభివద్ధికి కృషి చేశారు.

**నిర్బంధాలు అధిగమించి.. ఉద్యమాలు నిర్మించి..**

స్వాతంత్ర్యానంతరం 1948లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రాలో ఘోర నిర్బంధ విధానం ప్రారంభించగానే రామం అజ్ఞాతంలోకి వెళ్లి 1952 వరకూ అనేక కష్టాలకోర్చి రహస్యంగా పని చేశారు. 1962 ఆఖర్లో ఇతర కమ్యూనిస్టు నాయకులతోపాటు రామంను నిర్బంధించి ఎనిమిది మాసాలు జైల్లో పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1964 డిసెంబర్ 30న దేశరక్షణ చట్టం కింద డిటెన్యూగా చేసి అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ఆయన్ని 15 మాసాలకుపైగా జైల్లో పెట్టింది. జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి అనారోగ్యాన్ని లెక్కచేయక నిర్విరామంగా పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంలో పాల్గొంటూనే ఉన్నారు. 1935-51 మధ్య కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కొంతకాలం అఖిల భారత కంట్రోల్ కమిషన్ సభ్యులుగా ఉన్నారు. చాలా కాలం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా, అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. 1975 జూన్‌లో అత్యవసర పరిస్థితి విధించబడి పార్టీ నాయకులు మీసా కింద నిర్బంధంలోగాని, రహస్య జీవితంలోగాని ఉండాల్సి వచ్చినప్పుడు రామం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కమిటీ బాధ్యతలను నిర్వహించారు. 1957లో జరిగిన ఎన్నికల్లో రామం నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 35 వేల ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక సమస్యలను రామం పార్లమెంట్లో ప్రస్తావించారు. 1977, 1980 పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆయన ఈ స్థానం నుంచి పోటీ చేశారు. 1988 వరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గంలో పని చేసి అనారోగ్యం వల్ల బాధ్యతల నుంచి తప్పుకున్నారు. 1994 నవంబర్ 27న కన్నుమూశారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యాలయాన్ని ఆయన పేరిట నామకరణం చేశారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

**ప్రజాశక్తి - కలిదిండి**

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ఎస్.హర్షిత, కె.శ్యామల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బి.స్వర్ణకుమారి తెలిపారు. ఈ నెల 25వ తేదీన గుడివాడ ఎన్‌టిఆర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఇరువురు విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ కుమారిని, మాపుల్లేశ్వరరావు విద్యాకమిటీ సభ్యులు, పాఠశాల సిబ్బంది తెలిపారు.

**ముసునూరు :** మండలంలోని గుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ పివిఎస్.రామకృష్ణ తెలిపారు. ఆ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సుగుణరావును అభినందించారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

**ప్రజాశక్తి - ముసునూరు**

మండల కేంద్రమైన ముసునూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ముసునూరు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కూచిపూడి సాయిరాము, తహశీల్దార్ దాసరి సుధ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, హాజరు శాతం పెంచాలని, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని కోరారు.

## ప్రతిభా పురస్కారాలు అందజేత

**ప్రజాశక్తి - భీమడోలు**

విద్యలో ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలను సాధించిన భీమడోలుకు చెందిన ఇద్దరికి స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ ప్రతిభా పురస్కారాలను శనివారం అందించారు. భీమడోలులో మానవతా సంస్థ భీమడోలు శాఖ నెలవారి సమావేశం శాఖ అధ్యక్షులు పచ్చా వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మానవతా విద్యానిధి జిల్లా విభాగం అధ్యక్షులు అలపాటి నాగేశ్వరరావు, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి రాధాకృష్ణ హాజరయ్యారు. శాఖ ఛైర్మన్ గుళ్ల సూర్యకాంతారావు మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాలు స్వీకరిస్తున్న తుమ్మల సాయి చరణ్, అల్లి శ్రావ్య ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలను సాధించిన నేపథ్యంలో రానున్న కాలంలో వారు, వారితో పాటు వారి మిత్రబృందం మానవతా సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున ప్రతిభా పురస్కారం ప్రోత్సాహకాలను అందించారు. వారి తల్లిదండ్రులు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, అల్లి శ్రీనివాస్ దంపతులను సంస్థ తరఫున సత్కరించారు.

## రాష్ట్రాభివృద్ధిలో మోడీ నిర్లక్ష్య ధోరణి : సిపిఐ

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నారని సిపిఐ మండల కార్యదర్శి జుజ్జు శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ నాయకులు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు సమకూర్చాలన్నారు. ఉత్తరాంధ్ర రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీని అందించి, ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి తాడిగడప ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.బాజీ, లక్క లక్ష్మణరావు, ఇజ్జ నర్సయ్య, వెలగల రామారావు, కోడేలి లక్ష్మయ్య, ఎస్.గిరి, ప్రత్తిపాటి గంగరాజు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల్లో మోసాలను అరికట్టాలి

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

పెట్రోల్ బంకుల్లో మోసాలను అరికట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ శనివారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో పెట్రోల్ బంకుల్లో వినియోగదారులను మోసం చేస్తు దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. బైక్ ట్యాంక్‌లలో ఆయిల్ నింపడానికి ఒక పంపు, బాటిల్స్‌లో తీసుకెళ్లేందుకు మరొక పంపు ఉపయోగిస్తున్నారని తెలిపారు. వినియోగదారులు బిల్లు అడిగితే ముందుగానే చెప్పాలని దురుసుగా ప్రవర్తిస్తూ దౌర్జన్యాలకు దిగుతున్నారని పేర్కొన్నారు. స్థానిక మసీదు సెంటర్లో పెట్రోల్ బంకులో బిల్లు ఇచ్చేందుకు నిరాకరించిన తీరు అనుమానాలకు బలం చేకూర్చిందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రైతుల మోసకారి చంద్రబాబు : వైసిపి

**ప్రజాశక్తి - కైకలూరు రూరల్**


బొడ్డు నోబుల్

ఆక్వా రైతులకు హామీలంటూ చంద్రబాబు మరోసారి మోసానికి సిద్ధం అయ్యారని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు నోబుల్ విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రైతు సదస్సు అంటూ చంద్రబాబు తన పార్టీ అనుచరులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆక్వా రైతుల మ్యానిఫెస్టోలో రూ.1.50కే యూనిట్ విద్యుత్, ఆక్వా సాగుకు అన్ని ఉచితం అని ప్రకటించారని, తొమ్మిదేళ్ల ముఖ్యమంత్రిగా ఉండి ఆక్వా రంగానికి చేయలేని మేలు నేడు అధికారం కోసం గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఇటీవల నరసాపురంలో ముఖ్యమంత్రి జగన్ ఆక్వా రంగానికి వరాలు ప్రకటించారన్నారు. 30 ఏళ్లుగా ఆక్వాసాగు చేస్తున్నానని, గత ప్రభుత్వాల కంటే వైసిపి రైతులకు అండగా ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో మరింత మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబు అబద్ధాలు ఆక్వా రైతులు నమ్మే స్థితిలో లేరన్నారు.

## ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి కృషి

**ప్రజాశక్తి - కొయ్యలగూడెం**

ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి స్థలం పంచాయతీ తరపున మంజూరు చేయిస్తామని సర్పంచి ముప్పిడి విజయకుమారి క్లబ్ సభ్యులకు హామీ ఇచ్చారు. కొయ్యలగూడెం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు చిటికిన రమేష్ ఆధ్వర్యంలో సర్పంచికి, ఇఒ సత్యనారాయణకు క్లబ్ సభ్యులు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ సభ్యులకు ప్రభుత్వం త్వరలోనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయనుందని, అదే సమయంలో క్లబ్‌కి కూడా అనువైన విధంగా స్థలం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుతు చిటికిన రమేష్. వీరవరపు నివాస్, మన్నే దుర్గాబాబు, షేక్ అలీమ్, బొబ్బర కిషోర్ కుమార్, ముమ్మా సుబ్బారావు, బొబ్బర మంగరాజు, భార్గవ్ పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

మండలంలోని టి.నరసాపురం పరిధిలో ప్రకాషనగర్‌లో రూ.25లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు, బొర్రంపాలెంలో జగనన్న కాలనీల లేఅవుట్లు, శ్మశాన వాటికల మధ్య రూ.మూడు లక్షలతో నిర్మించనున్న ప్రహరి నిర్మాణాలకు జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు), ఎంపిపి దారబోయిన లక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ దేవరపల్లి ముత్తయ్య, వాసిరెడ్డి మధు, కాళ్నీడి సుబ్బారావు, సర్పంచి మోదుగు సునంద, నోముల సత్తిబాబు, ఎంపిడిఒ ఎన్.తిరుపతిస్వామి, తహశీల్దార్ జెవి.సుబ్బారావు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

**ప్రజాశక్తి - బుట్టాయగూడెం**

మండలంలోని అంతర్వేదిగూడెం, కాకులవారిగూడెం, కోట నాగవరం సచివాలయ పరిధిలో గంగవరం, చెంచుగుడెం, మెట్టగుడెం గ్రామాల్లో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతిరమణ, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, వైస్ ఎంపిపి గోగులోతు మోహనరావు, కుక్కల వరలక్ష్మి గోపి, సర్పంచి తెల్లం దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


చింతలపూడిలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

**ప్రజాశక్తి - చింతలపూడి**

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎయిమ్ ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర సిఐడి ఛీఫ్, ఎయిమ్ వ్యవస్థాపకులు పివి.సునిల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికి లబ్ధి చేకుర్చులా చేసింది డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని అన్నారు. అందరి హీరో అంబేద్కర్ మాత్రమే అని అన్నారు. మహిళలకు హక్కుల కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజసుధాకర్, ఎయిమ్ నాయకులు కాకర్ల సత్యం, రాజేంద్ర, బుచ్చిబాబు, గోందిరాజు, ఆర్‌కె జూనియర్ కాళాశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

**ఏలూరు :** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక అశోక్ నగర్ కెపిడిటి హైస్కూల్, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయులు టి.కస్తూరి, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందితో రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. కెపిడిటి స్కూల్ ప్రధానోపాధ్యాయులు టి.ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. ఆదిశేషు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని, రాజ్యాంగాన్ని మార్చాలని జరుగుతున్న కుట్రలను సాగనివ్వబోమని చెప్పారు.

**భీమడోలు :** భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి పి.సునీత మాన్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వడ్లపట్ల గ్రామంలో టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలుకు చెందిన చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ ఆధ్వర్యంలో భీమడోలులోని ఎస్‌సి బాలుర, బాలికల వసతి గృహాల్లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.మాన్‌సింగ్ వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నేవారిగూడెం యుపి పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలులో దళిత లిబరేషన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు అంబేద్కర్ ఆధ్వర్యంలో జై అంబేద్కర్ భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు.

**కొయ్యలగూడెం :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిపి గంజిమాల రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పరింపూడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి ముప్పిడి విజయకుమారి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**జంగారెడ్డిగూడెం :** స్థానిక డాంగేనగర్ అంబేద్కర్ సెంటర్ వద్ద రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్ఎ ఎలిజా మాట్లాడుతూ భారత రాజ్యాంగం రచించడంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించి ఎంతో కృషి చేశారని తెలిపారు. డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. అనంతరం సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, ఎస్‌కె ఆసిఫ్ మాట్లాడారు.

**మండవల్లి :** స్థానిక సెంటర్‌లో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి ప్రొఫెసర్, సుధామ ఫౌండేషన్ అధినేత సుధా బత్తుల విజయకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం రాసుకుని 72 ఏళ్ల గడిచినప్పటికీ రాజ్యాంగం అంటే తెలియని వారు 95 శాతం ఉన్నారన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని ప్రజలకు తెలియనీయకుండా చేస్తున్నాయన్నారు. రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలు పరుచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ ఝాన్సీ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, యోహాను రాజు, ఆశీర్వాదం, సురేష్ కుమార్, సుధీర్, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

**చింతలపూడి :** చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా జూనియర్ సివిల్ జడ్జి ఇబ్రహీం షరీఫ్ పాల్గొని మాట్లాడారు. టిడిపి ఆధ్వర్యంలో, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

**ముసునూరు :** తహశీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి తహశీల్దార్ దాసరి సుధ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ డివిబి.చంద్రశేఖర్, ఆర్ఐ సాయిరామ్, విఆర్ఒలు శోభన్‌బాబు, మస్తాన్, నవీన్ పాల్గొన్నారు.

**ముదినేపల్లి :** ముదినేపల్లిలోని స్వామ్ ఐటిఐలో ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని పెదపాలపర్రు హైస్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.హరిత, కళాశాల సిబ్బంది ఓలేటి మణిభీమరాజు, బోయిన కృష్ణమనోహర్, గంధం శివ, విజయదుర్గ పాల్గొన్నారు.

**ఏలూరు అర్బన్ :** భారత రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ గౌరవించాలని న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక పిడిబిటి జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవధికారి సంస్థ, ఎస్‌సి, ఎస్‌టి బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ, ఎఐడిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.రాజేశ్వరి పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. డిబిఆర్‌సి రూపొందించిన బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మూర్తి, రాష్ట్ర కన్వీనర్ రేవులగడ్డ మణి సింగ్,విజ్ఞాన కేంద్ర సభ్యులు కస్తూరిబాయి, డిబిఆర్‌సి కన్వీనర్ జ్యోతి, న్యాయవాదులు నాగేశ్వరావు, హరికిరణ్, సోషల్ వర్కర్స్ జాకబ్, నమ్మిన నాగార్జున పాల్గొన్నారు.

**దెందులూరు :** మండలంలోని కొవ్వలి హైస్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు నత్తాయోనా రాజు, జెడ్‌పిటిసి సభ్యులు లీలా నవకాంతం పాల్గొన్నారు.

**చాట్రాయి :** మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాతలకు పుష్పాంజలి ఘటించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవరెడ్డి మాట్లాడారు. అనంతరం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రాజేశ్వరి, పి.రత్తయ్య, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో అంబేద్కర్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు జి.సత్యనారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**జీలుగుమిల్లి :** స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణ, విఆర్ఒలు మాధురి, తులసి, బుల్లబ్బులు, అశోక్, శాంతి పాల్గొన్నారు.

**టి.నరసాపురం :** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్ర పటాలను, భారత రాజ్యాంగం పుస్తకాలను సచివాలయాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.లక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ శ్రీనురాజు, సొసైటీ చైర్ పర్సన్లు దేవరపల్లి ముత్తయ్య, వాసిరెడ్డి మధు, కాళ్నీడి సుబ్బారావు పాల్గొన్నారు.

**ఏలూరు టౌన్ :** స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ సిహెచ్ఎవి.బాపిరాజు మాట్లాడారు. అనంతరం భారత రాజ్యాంగం పట్ల తమ విశ్వాసాన్ని చూపుతామని కార్పొరేషన్ కార్యాలయ అన్ని విభాగాల సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

**కలిదిండి :** భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని సానారుద్రవరంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జక్కుల మహేష్, కలిదిండిలో ఎస్‌సి సంఘ నాయకులు బోడిగడ్డ కిషోర్, బళ్ల రాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బైక్ ర్యాలీ నిర్వహించారు.

**నూజివీడు :** శ్రీ అన్నే రామ కష్టయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధికారాణి పాల్గొని మాట్లాడారు.

**బుట్టాయగూడెం :** మండలంలోని ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల్లో, కోట నాగవరం, దొర మామిడి, బుట్టాయగూడెం, జైనవారిగూడెం సచివాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**కైకలూరు రూరల్ :** స్థానిక తాలూకా సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ పూలమాల వేసి, ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

**ఆగిరిపల్లి :** ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి ఎస్ఐ చంటిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**గణపవరం :** జల్లి కాకినాడలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో అడిషనల్ డిజిపి పివి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి బాతు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో సునీల్‌కుమార్ మాట్లాడారు.

మండలంలోని వరదరాజపురం, కాశిపాడు, మొయ్యేరు, సరిపల్లి, గణపవరం, పిప్పర, వెంకటరాజపురం గ్రామాల్లో గ్రామ సర్పంచి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**ప్రజాశక్తి - ముసునూరు**


గదులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్

ముసునూరు గురుకుల పాఠశాలలో అదనపు తరగతి గదులను నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం ప్రారంభించారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు, ప్రధానోపాధ్యాయుల క్వార్టర్స్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది క్వార్టర్సు రూ.2.13 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రోజ్‌లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఎంఎల్ఎ చొరవతో నాడు-నేడు రూ.25 లక్షల నిధులతో మంచినీటి వసతి, టాయిలెట్స్, కొన్ని తరగతి గదులకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రహారి గోడ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, గురుకుల సొసైటీ ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ రమణ, ఎపి కోఆపరేటివ్ సొసైటీ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, లోపూడి సర్పంచి పేరం కృష్ణ, తహశీల్దార్ దాసరి సుధ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కూచిపూడి సాయిరాము, రేగుల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# లక్ష్మీపురంలో నూరు శాతం గృహ నిర్మాణాలు పూర్తి

**ప్రజాశక్తి - భీమడోలు**

భీమడోలులో..

నూరు శాతం గృహ నిర్మాణాలు ప్రారంభించిన లక్ష్మీపురం లే అవుట్‌ను ఆదర్శంగా తీసుకుని గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని భీమడోలు మండల ప్రత్యేక కాధికారి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎవిఆర్.గంగాధరరావు కోరారు. మండలంలోని లక్ష్మీపురం, భీమడోలుకు చెందిన దిగుడుపాటి దిబ్బ ప్రాంతంలో ఉన్న మూడు లేఅవుట్‌ల వద్ద హౌసింగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణాల ప్రగతిని మండల ప్రత్యేక అధికారితో పాటు గృహ నిర్మాణ సంస్థ ఉంగుటూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాట్లాడుతూ లక్ష్మీపురంలో 19 ఇళ్లు గల లే అవుట్‌లో నూరు శాతం నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇప్పటికే ఐదు మంది వరకు గృహ ప్రవేశాలు చేశారన్నారు. మిగిలిన వారు డిసెంబర్ 21వ తేదీలోగా పూర్తిస్థాయిలో గృహప్రవేశాలు చేసే విధంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. భీమడోలు దిగుడుపాటి దిబ్బ మూడు లే అవుట్‌లలో సుమారు 80 శాతం గృహ నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇప్పటికే కొందరు గృహప్రవేశాల సైతం పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ జాన్‌రాజు, గృహ నిర్మాణ సంస్థ ఎఇ సతీష్, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగ, ఎంపిటిసి ముళ్లగిరి జాన్సన్, స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం :** జగనన్న ఇళ్ల నిర్మాణంలో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నామని ఎంపిపి రామారావు అన్నారు. మండలంలోని బయ్యన్నగూడెం గ్రామంలో సర్పంచి లింగిశెట్టి అనంతలక్ష్మి అధ్యక్షతన శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణ కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, లబ్ధిదారులు సహకరించాలన్నారు. అనంతరం లేఅవుట్లలో బోర్లను ప్రారంభించారు. లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్, తహశీల్దార్ పి.నాగమణి, హౌసింగ్ ఎఇ కె.సతీష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎం.ఉదయ్, మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్, వైస్ ఎంపిపిలు మాట్టా వనజాక్షి, తుమ్మలపల్లి గంగరాజు, మండల పరిషత్ విప్ గంటా శ్రీను, ఉప సర్పంచి కోరుకొండ లలిత, వార్డుమెంబర్లు బాలం సూర్యనారాయణ, తాలరి నాగు, మద్దిపాటి శ్రీను, పువ్వాలసరి రాంబాబు పాల్గొన్నారు.

**బుట్టాయగూడెం :** మండల స్థాయిలో గృహ నిర్మాణానికి సంబంధించి అవగాహన కార్యక్రమం కోటనాగవరం దొరమామిడి సచివాలయాల పరిధిలో మండల స్థాయి అధికారులతో శనివారం నిర్వహించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో మండల స్థాయి అధికారులు మాట్లాడి గృహ నిర్మాణం త్వరగా చేసుకోవాలన్నారు. దొరమామిడి గ్రామానికి చెందిన లబ్ధిదారు మడకం గంగాదేవి ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, బుట్టాయగూడెం మండల ప్రత్యేక అధికారి రమాదేవి, తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి, ఎంపిడిఒ కె.వాణి, ఐకెపి ఎపిఎం పద్మ, సర్పంచులు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మురళీకృష్ణ పాల్గొన్నారు.

## శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

పోలవరం ముంపులో భాగంగా మండలంలోని దర్భగూడెం పంచాయతీ పరిధిలో సిరివాక పునరావాస గ్రామంలో నిర్వాసితులు కోరిన చోట శ్మశానవాటికను కేటాయించాలని నిర్వాసిత సంఘం నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన కొండ్ల శ్రీరాములు మృతి చెందడతో అంతిమ కార్యక్రమాలు చేసేందుకు అనువైన ప్రదేశం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెవెన్యూ వారిని స్థలం చూపించమంటే ఎక్కడో దూరాన చూపించి చేతులు దులుపుకుంటున్నారన్నారు. గతంలో కూడా ఒక బాలుడు చనిపోయినప్పుడు ఇదే పరిస్థితి ఎదురైందని, అప్పట్లో గంగన్నగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారని తెలిపారు. రెవెన్యూ అధికారులు నిర్వాసితులు కోరిన చోట శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.

## 'చంద్రబాబు పర్యటన జయప్రదానికి పిలుపు'

**ప్రజాశక్తి - చింతలపూడి**

ఈ నెల 30వ తేదీన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి కోరారు. పట్టణంలోని షాదిఖానాలో కొండ్రు దేవా అధ్యక్షతన శనివారం నిర్వహించిన టిడిపి మండల స్థాయి సమావేశంలో ముత్తారెడ్డి మాట్లాడారు. చంద్రబాబు ఉభయగోదావరి జిల్లాల పర్యటనలో 30వ తేదీన చింతలపూడి వస్తున్నారని, టిడిపి నేతలు జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, పట్టణ కార్యదర్శి బోడ నాగభూషణం చిట్లూరి ధర్మరాజు పాల్గొన్నారు.

## పిల్లలకు విలువలు నేర్పాలి

**ప్రజాశక్తి - చింతలపూడి**

పిల్లలకు చదువుతో పాటు విలువలు నేర్పాలనే ఉద్దేశంతో విద్యార్థుల తాతయ్యలు, అమ్మమ్మ, నానమ్మలను పిలిచి వారికి పిల్లల చేత పువ్వులతో పాదాభివందనం చేయించినట్లు చింతలపూడి శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్‌కి పాదాభివందన కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఇన్‌ఛార్జి పార్థసారథి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి గురవమ్మ పాల్గొన్నారు.

## న్యాయం చేయండి..!

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండల కేంద్రమైన ముదినేపల్లిలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముదినేపల్లిలోని సంత మార్కెంట్ సమీపంలో పోల్‌రాజ్ వంతెన వద్ద ముదినేపల్లి పంచాయతీ శివారు అన్నవరం గ్రామానికి చెందిన పోలగాని రాజమ్మ ఎన్నో ఏళ్లుగా చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఇటీవల ఎస్ఐ కిందిస్థాయి అధికారి రాజమ్మ చేపల దుకాణానికి వచ్చి కొరమీనులను కొనుగోలు చేసేందుకు బేరం ఆడాడు. రూ.వేయి విలువైన కొరమీనులను రూ.రెండు వందలకు ఆ పోలీసు అధికారి ఇవ్వాలని పట్టుబట్టాడు. కుదరదని రాజమ్మ చెప్పడంతో కోపంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. నాలుగు రోజుల తర్వాత ఆ పోలీస్ అధికారి రాజమ్మ దుకాణానికి వచ్చి ఇదీ ప్రభుత్వ స్థలం, ఇక్కడ నుంచి దుకాణం ఖాళీ చేయాలని బెదిరించాడు. ఈ విషయమై రాజమ్మ ప్రజాశక్తితో మాట్లాడుతూ తన భర్త పోలగాని వెంకటేశ్వరరావుకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిందన్నారు. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు చెప్పింది. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ వ్యాపారం చేస్తున్నానని, రెక్కడితే గాని డొక్కాడని పరిస్థితి అని వాపోయింది. తమను ఇబ్బంది పెట్టేలా చేపల దుకాణాన్ని ఖాళీ చేయాలని పోలీసు అధికారి బెదిరించడం చాలా బాధగా ఉందని ఆవేదన చెందుతోంది.

## 'రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న టిడిపి, జనసేన'

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రాజ్యాంగాన్ని, న్యాయ వ్యవస్థలను టిడిపి, జనసేన పార్టీలు అపహాస్యం చేస్తున్నాయని వైసిపి లీగల్‌సెల్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ డివి.రామాంజనేయులు అన్నారు. వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమం శనివారం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన పార్టీలు రాజకీయ లబ్ధి పొందేందుకు రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ న్యాయవ్యవస్థ కళంకానికి పాల్పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి లీగల్ సెల్ ఏలూరు సిటీ అధ్యక్షులు బి.జగన్నాధ్‌రెడ్డి, నాయకులు ఎన్.ఏసురత్నం, బి.రంగారావు, విజయకుమారి పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

**ప్రజాశక్తి - ఆగిరిపల్లి**

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై ఎస్ఐ ఎస్.చంటిబాబు తన సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,770 నగదును స్వాధీనం చేసుకున్నారు.

## తెలంగాణ మద్యం పట్టివేత

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద శనివారం ఎస్ఇబి సిఐ వణికంఠరెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణ నుంచి ఆంధ్రాకు కారులో మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. మద్యాన్ని, కారును స్వాధీనం చేసుకుని, కె.నాగవెంకటరమేష్‌ను అదుపులోకి తీసుకున్నామని సిఐ తెలిపారు.

## మద్యం విక్రేత అరెస్ట్

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మద్యం విక్రేతను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ షణ్ముఖసాయి తెలిపారు. మండలంలోని కోడూరులో సుంకర రమేష్ మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ షణ్ముఖసాయి తన సిబ్బందితో దాడి చేసి రమేష్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 70 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
**I.A. 634/2018, O.S. 329/2010**
బిట్వీన్:
నాళం వెంకట లక్ష్మీనారాయణ
...పిటీషనరు /వాది
Vs
తమ్మినైన హరికృష్ణ (died)
తమ్మినైన లక్ష్మి
...రెస్పాండెంట్లు /ప్రతివాద్లు:
To:
రెస్పాండెంటు-2: శ్రీమతి తమ్మినైన లక్ష్మి, W/o. లేటు హరికృష్ణ, రామచంద్రరావుపేట, ఏలూరు, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా, ELR JCJC Limits.
పై నెంబరు దావాలో వాదిపై దివి. 9-4-2018 సం॥లో I.A. 593/2012 మరియు దావాలో శ్రీ కోర్టు వారు Pass చేసిన default order ను రద్దుచేసి పిటీషనును, దావాను restore చేయించమని వాది దాఖలు చేసిన పై నెంబరు I.A. 634/2018 పిటీషనులో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక బుద్ధిపూర్వకంగా avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ పేపరు ప్రకటన యివ్వబడినది. కాబట్టి దివి. 07-12-2022 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ లగాయితూ మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
కె.వి.వి.హరిమోహన్
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు కొవ్వూరు
21-11-22 సెల్: 9160061613

మార్కుల లిస్ట్ పోయినది
పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరం మండలం, కొణితివాడ గ్రామంలో నివాసం ఉంటున్న యరకరాజు రుక్మిణి, తండ్రి: సూర్యనారాయణ అను నేను కొణితివాడ హైస్కూల్లో 1972-1973 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్నాను. రోల్ నెంబర్ 44733, అడ్మిషన్ నెంబర్ 807. ఈ నెల 19 వ తేదీన జిరాక్స్ నిమిత్తం షాప్‌కి వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినవి. కావున దొరికిన వారు ఈ నెంబర్‌కు అందజేయగలరు.
యరకరాజు రుక్మిణి
నాగరాజు చెరువు వద్ద, కొణితివాడ, వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.
సెల్ నెంబర్ : 94409 73366